క్లుప్తంగా

పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలి



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మెట్‌పల్లి: పట్టణంలోని పరిసరాల పరిశుభ్రతకు ప్రజలు సహకరించాలని కమిషనర్ మోహన్ కోరారు. వంద రోజుల ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా మంగళవారం 25 వార్డులో మున్సిపల్ సిబ్బందితో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా తడి, పొడి చెత్తతో పాటు పలు అంశాలపై స్థానికులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి శానిటరీ ఇన్‌స్పెక్టర్ రత్నాకర్, విష్ణు, ముజీబ్ తదితరులున్నారు.

డ్రెయినేజీల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలి


ఈవోకు వినతిపత్రం అందిస్తున్న గ్రామస్తులు

మల్లాపూర్: ఎస్సీ కాలనీల్లోని 2, 3 వార్డుల్లో దెబ్బతిన్న డ్రెయినేజీల మరమ్మతుకు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు విన్నవించారు. మంగళవారం గ్రామపంచాయతీ కార్యాలయంలో ఈవో శ్రీనివాస్‌కు వినతిపత్రం అందించారు. వర్షాలకు పలు వార్డులోని దెబ్బతిన్న డ్రెయినేజీల్లో నుంచి మురికినీరు ఇళ్లల్లోకి చేరి ఇబ్బందులు పడుతున్నామని, సమస్యలను పరిష్కరించి తగు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్సీ కాలనీవాసులు ఎర్ర లక్ష్మి, రాజు, మాట్ల గంగాధర్, ఆకుతోట నవీన్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ అప్పగింత



సెల్‌ఫోన్ అందిస్తున్న ఏఎస్సై

మల్యాల: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు ఆంజనేయస్వామి దర్శనం కోసం వచ్చి సెల్‌ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తికి ఏఎస్సై శ్రీనివాస్ సెల్‌ఫోన్ తిరిగి అప్పగించారు. కరీంనగర్‌కు చెందిన డాక్టర్ సాహిల్‌రావు తన సుమారు రూ.1 లక్ష విలువైన ఐఫోన్ పోగొట్టుకోగా, ఓ భక్తుడికి సెల్‌ఫోన్ దొరకడంతో ఏఎస్సై శ్రీనివాస్‌కు అప్పగించారు. దీంతో వెంటనే మైక్‌లో అనౌన్స్ చేసి, పోగొట్టుకున్న ఐ ఫోన్‌ను తిరిగి డాక్టర్‌కు అప్పగించారు.

పాడి పరిశ్రమతో రైతులకు లాభాలు


మందులు పంపిణీ చేస్తున్న పశువైద్యాధికారి

జగిత్యాలరూరల్(సారంగాపూర్): పాడి పరిశ్రమతో రైతులకు లాభాలుంటాయని సారంగాపూర్ మండల పశువైద్యాధికారి సునీల్ అన్నారు. మంగళవారం బీర్‌పూర్ మండలం తాళ్లధర్మారంలో ధర్మపురి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ చిల్ముల లావణ్య ఉచిత పశువైద్య శిబిరం ప్రారంభించి మాట్లాడారు. రైతులు పశుపోషణపై దృష్టి సారించాలని, రైతులకు సబ్సిడీలో పశుగ్రాసం విత్తనాలు పంపిణీ చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ నర్సింహులు, పాలకవర్గ కమిటీ సభ్యులు పంచాయతీ కార్యదర్శి, నాయకులు పాల్గొన్నారు.

ఉద్యోగులకు బదిలీలు సాధారణం


చరణ్‌దాస్‌ను సన్మానిస్తున్న ఉద్యోగులు

జగిత్యాలరూరల్: ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సాధారణమేనని డీఆర్డీఏ పీడీ రఘువరన్ అన్నారు. బదిలీపై వెళ్తున్న సెర్ప్ ఏపీడీ చరణ్‌దాస్‌కు మంగళవారం వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో సెర్ప్ కార్యక్రమాలు, మహిళా శక్తి కార్యక్రమాలు ధాన్యం కొనుగోళ్ల నిర్వహణలో ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ఏపీడీ సునీత, డీపీఎం జిల్లా అధ్యక్షుడు వెంకటేష్, జిల్లా ఏపీఎంల యూనియన్ అధ్యక్షుడు చక్రవర్తి, పాల్గొన్నారు.

వానాకాలం సాగుకు సన్నద్ధం

- అందుబాటులో విత్తనాలు, ఎరువులు
- పంటమార్పిడితో లాభాలు
- ఒకే రకమైన పంట వేయొద్దని అధికారుల సూచన


వీవీరావుపేటలో దుక్కి దున్ని విత్తనాలు వేస్తున్న రైతులు

మల్లాపూర్: తొలకరి చినుకులు మొదలైన తరుణంలో వానాకాలం సీజన్‌కు గాను పంటల సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. సాగుకు కావాల్సిన విత్తనాలు, ఎరువులను ప్రభుత్వం, వ్యవసాయ శాఖ అధికారులు ఆగ్రోస్, సింగిల్ విండో, డీసీఎంఎస్‌ల ద్వారా రైతులకు అందించేందుకు అన్ని ఏర్పాటు చేసి పంపిణీ చేస్తున్నారు. మండల వ్యాప్తంగా వానాకాలం సీజన్‌కు గాను ఈసారి పంటల సాగు గణనీయంగా పెరగనుందని, రైతులు ఒకే పంట వేసి నష్టపోకుండా రైతులు పంట మార్పిడి చేయాలని వ్యవసాయశాఖ అధికారులు సూచిస్తున్నారు. ఈ సీజన్‌లో సాగు సాధారణ స్థాయి కంటే మరో 10 శాతం ఎక్కువగా పంట సాగు అవుతుందని అంచనా వేస్తున్నారు.

అందుబాటు విత్తనాలు, ఎరువులు..

వానాకాలం సీజన్‌కు గాను వ్యవసాయశాఖ జీలుగ, జనుము, వరి, మొక్కజొన్న, పెసర్లు, కందుల విత్తనాలను రైతులకు అందుబాటులో ఉంచి పంపిణీ చేస్తున్నారు. వానాకాలం సీజన్‌కుగాను యూరియా–1200 టన్నులు, డీఏపీ–400 టన్నులు, కాంప్లెక్స్–600 టన్నులు, ఎంవోపీ–80 టన్నులను అందుబాటులో ఉంచి పంపిణీ చేస్తున్నారు. రైతుల డిమాండ్ మేరకు మరిన్ని ఎరువులు అందించేందుకు సిద్ధంగా ఉందని వ్యవసాయ అధికారులు పేర్కొన్నారు.

సాగు అంచనా వివరాలు

వ్యవసాయశాఖ అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలో వానాకాలం సీజన్‌కుగాను సాగు అంచనా వివరాలు ఇలా ఉన్నాయి. వరి 20,500 ఎకరాలు, పసుపు–2500 ఎకరాలు, మొక్కజొన్న–6,500 ఎకరాలు, పెసర్లు–65 ఎకరాలు, కందులు–100 ఎకరాలు, చెరుకు–1050, కూరగాయలు–180 ఎకరాల్లో పంటలను సాగు చేసేందుకు అంచానా వేసినట్లు తెలిపారు.

పంట మార్పిడితో లాభాలు

ఒకే రకమైన పంటను వేసి నష్టపోయే కంటే పంట మార్పిడి ద్వారా లాభదాయకమైన పంటలను సాగు చేసి అధిక దిగుబడిని సాధించవచ్చు. నేల సారవంతమవుతుంది. పంట ఉత్పత్తి ధర ఎక్కువగా వచ్చే అవకాశాలు మెండు. నీటి వాడకం, ఎరువుల వాడకం తక్కువ. నష్టాల నుంచి లాభాలు పొందేందుకు అవకాశం ఎక్కువగా ఉంటుంది.

రైతులకు సూచనలిస్తున్నాం



వానాకాలం సీజన్ పంటల సాగుపై రైతులకు తగిన సలహాలు, సూచనలు ఇస్తున్నాం. భారీ వర్షాలు పడి భూమి నానేంత వరకు ఆరుతడి పంటలు వేసుకోవద్దని తెలిపాం. వానాకాలం సీజన్‌కు విత్తనాలు, ఎరువులను ఆగ్రోస్, సింగిల్‌విండో, డీసీఎంస్ కేంద్రాల్లో అందుబాటులో ఉంచాం. రైతులు సమాచారం కోసం వ్యవసాయశాఖ కార్యలయంలో అధికారులను సంప్రదించాలి.

– లావణ్య, వ్యవసాయాధికారి, మల్లాపూర్



కథలాపూర్: మండలంలోని దూలూర్ గ్రామశివారులో వైకుంఠధామం వద్ద కమాన్ పిల్లర్లు అడుగుభాగం పగుళ్లు చూపి కృంగిపోయాయి. ఈ వర్షాకాలం పిల్లర్లు మరింత ప్రమాదకరంగా మారే అవకాశముందని గ్రామస్తులు పేర్కొన్నారు. అధికారులు చొరవ చూపి కమాన్ పిల్లర్లను మరమ్మతులు చేయించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి
లక్ష్మీకాంత్,ఆర్‌అండ్‌బీ, ఏఈ కథలాపూర్, సెల్: 7702537843

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9705346639, 9440061630, 9705346643

రెవెన్యూ సదస్సులు సద్వినియోగం చేసుకోవాలి



జాబితాపూర్, ఇబ్రహీంపట్నంలో దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

జగిత్యాలరూరల్: రైతులు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని జగిత్యాల రూరల్ తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్ మండలంలోని జాబితాపూర్, అనంతారం గ్రామాల్లో రెవెన్యూ సదస్సు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించారు.

ఇబ్రహీంపట్నం: భూ భారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వరప్రసాద్ అన్నారు. ఇబ్రహీంపట్నం మండలకేంద్రంలో, మండలంలోని తిమ్మాపూర్‌లో మంగళవారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు.

మేడిపల్లి: మండలంలోని పోరుమల్ల, భీమారం మండలంలోని గోవిందారంలో మంగళవారం భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజనుల భూ సమస్యల పరిష్కారమే భూభారతి లక్ష్యం

రాయికల్: గిరిజనుల భూ సమస్యల పరిష్కారమే భూభారతి లక్ష్యం తహసీల్దార్ నాగార్జున అన్నారు. మంగళవారం రాయికల్ మండలం జగన్నాథపూర్ గ్రామంలో భూభారతి రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఐలు పద్మయ్య, దేవదాసు, గ్రామ నాయకులు పాల్గొన్నారు.

వృద్ధులకు ప్రత్యేక వైద్యసేవలు అందుబాటులోకి తేవాలి


వినతిపత్రం అందిస్తున్న సీనియర్ సిటిజెన్లు

జగిత్యాల: వృద్ధులకు ప్రత్యేక వైద్యసేవలు అందుబాటులోకి తీసుకురావాలని రాష్ట్ర అధ్యక్షుడు నర్సింహారావు కోరారు. జగిత్యాల సీనియర్ సిటిజన్స్ జిల్లా అధ్యక్షుడు హరి అశోక్‌కుమార్‌తో కలిసి మంగళవారం వైద్య శాఖ మంత్రి రాజ నర్సింహకు వినతిపత్రం అందజేశారు. వారి వెంట జిల్లా ప్రధాన కార్యదర్శి విశ్వనాథం, ప్రకాశ్‌రావు తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని సంస్థాగతంగా బలోపేతం చేయాలి


మాట్లాడుతున్న వడ్డెపల్లి శ్రీనివాస్

మల్లాపూర్: సంస్థాగతంగా బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర నాయకుడు వడ్డెపల్లి శ్రీనివాస్ అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండల కేంద్రంలోని శ్రీ వేంకటేశ్వర కళ్యాణ మండపంలో బీజేపీ మండల అధ్యక్షుడు గోపిడి శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో బీజేపీ మండల కార్యవర్గంను నియమించారు. మండల ఉపాధ్యక్షులుగా గుయ్యా మల్లే, లవంగ శివకుమార్, వాకిటి తిరుపతిరెడ్డి,గుండు భూమాగౌడ్, ప్రధాన కార్యదర్శులుగా దేశెట్టి కిరణ్, సరికెల నర్సయ్య, కాంతయ్యచారి, ఆకుల సతీశ్, బీజేవైఎం మండల అధ్యక్షుడిగా పందిరి నాగరాజు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షుడిగా గజ్జి శ్రీనివాస్, ఎస్టీ మోర్చా మండల అధ్యక్షుడిగా గుగ్లావత్ రాజేందర్, ఎస్సీ మోర్చా మండల అధ్యక్షుడిగా మారంపెల్లి తిరుపతి, మహిళా మోర్చా మండల అధ్యక్షురాలిగా గడ్డం శాంతమ్మ, నలుగురు కార్యదర్శులు, 20మంది కార్యవర్గసభ్యులను నియమించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి ఎర్ర లక్ష్మీ, బూత్ అధ్యక్షులు, శక్తి కేంద్రాల ఇన్‌చార్జీలు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇళ్లు రాలేదని ఆందోళన

ధర్మపురి: ఇందిరమ్మ ఇళ్లు ఇస్తామంటేనే ఉన్న ఇళ్లను కూలగొట్టుకున్నామని, ఇప్పుడు రాలేదంటున్నారని అంటూ మంగళవారం ఆర్డీవో మధుసూదన్ ఎదుట బాధితులు తమ గోడు వెల్లబోసుకున్నారు. మండలంలోని పెద్ద నక్కలపేటకు చెందిన కొందరు బాధితులు సోమవారం ఆందోళనకు దిగగా.. మంగళవారం ఆర్డీవో గ్రామానికి చేరుకున్నారు. దీంతో మంజుల, ఆకుల రమ, తిరుమల మాట్లాడుతూ.. తాము అర్హులమైనా మొదటి జాబితాలో తమ పేర్లు రాలేదన్నారు. కార్యదర్శి మురళిని ఆరా తీసిన ఆర్డీవో మొదటి జాబితాను పరిశీలించారు. అందులో అనర్హులకు అవకాశం వచ్చినట్లు తెలుసుకుని బాధితులకు నచ్చజెప్పారు. రెండో విడతలో తప్పకుండా మంజూరు చేస్తామన్నారు. డిప్యూటీ తహసీల్దార్ సుమన్, ఎంపీడీవో రవీందర్, నాయకులు ఎస్.దినేష్ పాల్గొన్నారు.

▶ **విద్యార్థికి అభినందన**

మల్లాపూర్: మండలంలోని కొత్త దాంరాజుపల్లి గ్రామానికి చెందిన శ్రీకర్ జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో 1200 ర్యాంక్ సాధించి కర్నాటకలోని ధర్వాడ్ ఐఐటీలో సీటు సాధించడం గర్వకారణమని తహసీల్దార్ రమేశ్ గౌడ్, ఎస్సై రాజు అన్నారు. మంగళవారం విద్యార్థిని వేర్వేరుగా సన్మానించారు. శ్రీకర్ మారుమూల గ్రామంలో జన్మించి ఐఐటీకి ఎంపికై పాఠశాలకు, తల్లిదండ్రులకు మంచిపేరు తీసుకొచ్చాడని అభినందించారు. కార్యక్రమాల్లో కేరళ హైస్కూల్ ప్రిన్సిపల్ సీబీ.అనిల్‌సింగ్, శ్రీకర్ తల్లిదండ్రులు గంగిశెట్టి శ్రీకాంత్–శ్రావణి పాల్గొన్నారు.

▶ **మధ్యాహ్న భోజన నిర్వాహకులకు వైద్యపరీక్షలు**

బుగ్గారం: మండలంలోని వివిధ ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న మధ్యాహ్న భోజన నిర్వాహకులకు మంగళవారం స్థానిక ఎంఆర్సీ కేంద్రంలో వైద్యపరీక్షలు నిర్వహించారు. పలువురి నుండి రక్తనమూనాలు సేకరించి పరీక్షలు చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే వైద్యులు వెంకటేష్, మహేశ్వరి,ఎంఈవో వెంకటేశ్వర్లు,సీఆర్పీ పురుషోత్తం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

▶ **కంప్యూటర్ వితరణ**

రాయికల్: మండలం అల్లీపూర్ గ్రామానికి చెందిన కాసం మురళీ జ్ఞాపకార్థం ఆయన కుమారుడు శ్రీనివాస్ మంగళవారం ప్రభుత్వ పాఠశాలకు కంప్యూటర్, ప్రింటర్‌ను అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ మోర విజయలక్ష్మి, పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎం గుర్రం శ్రీనివాస్‌గౌడ్, లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ సికింద్రాబాద్ ప్యారడైజ్ అధ్యక్షుడు గణేశ్, సెక్రటరీ చంద్రమోహన్ పాల్గొన్నారు.

▶ **విద్యుదాఘాతంతో మూడు గేదెలు మృతి**

రాయికల్: మండలంలోని ఇటిక్యాల గ్రామంలోని బ్రిడ్జి సమీపంలోని విద్యుత్ వైరు తెగి మూడు పాడి గేదెలు మంగళవారం మృతిచెందాయి. గ్రామానికి చెందిన దండవేని అంతయ్య, మారాసు గంగారాం, గడికొప్పుల మల్లేశంకు చెందిన పాడి గేదెలు మేత కోసం వెళ్లగా ప్రమాదవశాత్తు విద్యుత్ వైర్లు తగిలి గేదెలపై పడటంతో అక్కడికక్కడే మృతిచెందాయి. సుమారు రూ.2 లక్షల నష్టం వాటిల్లిందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు కోరారు.

▶ **ఇసుక ట్రాక్టర్లు పట్టివేత**

మల్లాపూర్: మండలంలోని పాతదాంరాజుపల్లి శివారులోని గోదావరి నది నుంచి మంగళవారం అక్రమంగా తరలిస్తున్న రెండు ఇసుక ట్రాక్టర్లను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై రాజు తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. పాతదాంరాజుపల్లి శివారులోని గోదావరి నది నుంచి ట్రాక్టర్లలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారనే సమాచారంతో సిబ్బందితో దాడి చేసి రెండు ట్రాక్టర్లను పట్టుకున్నట్లు తెలిపారు. వాటిని స్థానిక పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు.

▶ **సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ**

పెగడపల్లి: మండల కేంద్రంలోని రైతువేదికలో మండలంలోని పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం కాంగ్రెస్ శ్రేణులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ బుర్ర రాములుగౌడ్, కాంగ్రెస్ శ్రేణులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లోనే చేరాలి

మల్లాపూర్: ఇంటర్ పూర్తయిన విద్యార్థులు మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోనే చేరాలని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే.వెంకయ్య కోరారు. మంగళవారం మల్లాపూర్‌లో ఇంటర్ పూర్తయిన విద్యార్థుల ఇళ్ల వద్దకు వెళ్లి అధ్యాపకులు ప్రచారం చేశారు. ప్రైవేట్ కళాశాలలకు దీటుగా 90 శాతం ఫలితాలను సాధించిన ఏకైక కళాశాలగా మెట్‌పల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల నిలిచిందన్నారు. కార్యక్రమంలో మెట్‌పల్లి డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ తొంటి దేవన్న, అధ్యాపకులు బిల్ల రాజేందర్, మనోజ్‌కుమార్, గట్టయ్య, అంజయ్య, శ్రీకాంత్, సత్తయ్య, విద్యార్థులు పాల్గొన్నారు.

ఉపాధిహామీ పనుల్లో నాణ్యత పాటించాలి

జగిత్యాలరూరల్: గ్రామీణ ప్రాంతాల్లో చేపట్టే ఉపాధిహామీ పనుల్లో నాణ్యతాప్రమాణాలు పాటించాలని జిల్లా ట్రెనింగ్ కో–ఆర్డినేటర్ మనోజ్ అన్నారు. మంగళవారం జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల పంచాయతీ కార్యదర్శులు, ఫీల్డ్ అసిస్టెంట్లు, మేట్లకు పనుల నాణ్యత ప్రమాణాలపై శిక్షణ తరగతులు నిర్వహించారు. ఉపాధిహామీ పనులు నాణ్యత ప్రమాణాలు ఉండేలా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీవోలు రమాదేవి, విజయలక్ష్మి, ఎంపీవో వాసవి, ఏపీవోలు గంగలక్ష్మణ్, దయాకర్, టీఏలు, ఈసీలు పాల్గొన్నారు.

దరఖాస్తులు ఆహ్వానం

జగిత్యాల: అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో మూడేళ్ల శిక్షణ పొందేందుకు షెడ్యూల్ కులాలకు చెందిన లా పట్టభద్రుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి రాజ్‌కుమార్ తెలిపారు. జూలై 31 లోపు WWW. TELANGANAEPASS.CGG. GOV. IN ద్వారా దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. చెప్పారు. ఎంపికైన వారికి నెలకు ఒక్కొక్కరికి రూ.3 వేల స్టైఫండ్‌తో పాటు పుస్తకాలు, ఫర్నీచర్ కోసం రూ.50 వేలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. అభ్యర్థుల ఎంపిక ఆగస్టు 10న నిర్వహిస్తామని పేర్కొన్నారు.

సీఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు క్షీరాభిషేకం


క్షీరాభిషేకం చేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మల్యాల: రైతు భరోసా నిధులు విడుదల చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం కాంగ్రెస్ నాయకుల ఆధ్వర్యంలో మల్యాల మండల కేంద్రంలోని సోనియా గాంధీ గుడి వద్ద సీఎం రేవంత్ రెడ్డి, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు దొంగ ఆనంద రెడ్డి, బత్తిని మల్లేశ్వరిశ్రీనివాస్ గౌడ్, వెల్మ లక్ష్మారెడ్డి, దారం ఆదిరెడ్డి, శనిగరపు తిరుపతి, ఎండీ.ఇమామ్, కంచర్ల లక్ష్మణాచారి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల్లో చిన్నారులకు అక్షరాభ్యాసం


చిన్నారులకు అవగాహన కల్పిస్తున్న టీచర్లు

జగిత్యాలరూరల్/పెగడపల్లి/మల్యాల/కథలాపూర్/కొడిమ్యాల: అంగన్‌వాడీల్లో చిన్నారులకు ఒత్తిడి లేని విద్యాబోధన అందిస్తున్నామని ఐసీడీఎస్ సీడీపీవో వీరలక్ష్మి, సూపర్‌వైజర్లు లావణ్య,మహేశ్వరీ, సుభద్ర, శారద,శోభరాణి,సుధారాణిలు అన్నారు. అమ్మబాట అంగన్‌వాడీ బాట కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. జగిత్యాల రూరల్ మండలం చల్‌గల్ గ్రామంలో లావణ్య, పెగడపల్లి మండలంలోని అయితిపల్లి, పెగడపల్లి, అంగన్‌వాడీ కేంద్రాలు, మల్యాల మండల కేంద్రంలో, కథలాపూర్ మండలం దుంపేట గ్రామంలో, ఇబ్రహీంపట్నం మండలంలోని వర్షకొండ, ఫకీర్‌కొండాపూర్ గ్రామాల్లో, కొడిమ్యాల మండలం పూడూరు గ్రామంలో చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో అందుతున్న సేవలను వివరిస్తూ గ్రామాల్లో ర్యాలీలు తీశారు.పౌష్టికాహారం పంపిణీ చేశారు. కార్యక్రమాల్లో అంగన్‌వాడీ టీచర్లు చిన్నారులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లు వేగంగా నిర్మించుకోవాలి


భూమిపూజ చేస్తున్న జువ్వాడి నర్సింగరావు

ఇబ్రహీంపట్నం: ఇందిరమ్మ ఇళ్లను లబ్ధిదారులు వేగంగా నిర్మించుకోవాలని కాంగ్రెస్ పార్టీ కోరుట్ల నియోజకవర్గం ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. మంగళవారం మండల కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మండలంలో 466 ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని తెలిపారు. 2వ విడత మరిన్ని ఇళ్లు మంజూ చేస్తామని తెలిపారు. అనంతరం వర్షకొండ గ్రామంలో 30 మందికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ బోరిగం రాజు, వైస్ చైర్మన్ ఎలాల వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్ పార్టీ ఎస్సీసెల్ మండల అధ్యక్షుడు దుదిగాం గంగాధర్, కాంగ్రెస్‌పార్టీ మండల అధ్యక్షుడు గూడ శ్రీకాంత్‌రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ

మల్లాపూర్: లబ్ధిదారులకు మంజూరైన ఇందిరమ్మ ఇళ్లను త్వరగా కట్టుకోవాలని కిసాన్‌కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఎలాల జలపతిరెడ్డి అన్నారు. మంగళవారం మల్లాపూర్ మండలంలోని రత్నాపూర్‌లో లబ్ధిదారులతో కలిసి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు ఆయన భూమిపూజ చేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ నల్ల రాజన్న, ప్యాక్స్ వైస్ చైర్మన్ గొండ రాజేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పూండ్ర శ్రీనివాస్‌రెడ్డి, గ్రామశాఖ అధ్యక్షుడు సుద్దపెల్లి మల్లయ్య, నాయకులు పాల్గొన్నారు.

కథలాపూర్ మండలంలో...

కథలాపూర్: మండలంలోని కలిగోట, రాజారాం తండా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్లకు మంగళవారం అధికారులు, నాయకులు భూమిపూజ చేశారు. ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్దిదారులు వీలైనంత త్వరగా పనులు ప్రారంభించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు కిరణ్, చంద్రశేఖర్, మండల కాంగ్రెస్ నాయకులు కల్లెడ గంగాధర్, అంబటి రాధాకృష్ణ, పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం విద్యార్థుల ఎంపిక

మేడిపల్లి: ఉమ్మడి మండల వ్యాప్తంగా ఉన్న పాఠశాలలో ప్రస్తుత విద్యా సంవత్సరంలో నాలుగవ తరగతి చదువుతున్న విద్యార్థులు స్పోర్ట్స్ స్కూల్ ప్రవేశాల కోసం ఎంపికలు జరుగుతున్నట్లు భీమారం మండల విద్యాధికారి మధుసూదన్‌రెడ్డి, మేడిపల్లి మండల విద్యాధికారి లక్ష్మీనర్సయ్య తెలిపారు. ప్రవేశాలలో పాల్గొనాలనుకునే విద్యార్థులు జూన్ 19వ తేదిన మేడిపల్లి మండల కేంద్రంలోని గ్రామీణ క్రీడా ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఫిజికల్ టెస్టులో పాల్గొనాలని కోరారు.

ఇబ్రహీంపట్నం: తెలంగాణ క్రీడా పాఠశాలల ప్రవేశాల కోసం ఈ నెల 19న ఉదయం 9 గంటలకు మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండలస్థాయి క్రీడాకారులను ఎంపిక చేస్తున్నట్లు ఎంఈవో మధు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 18 సాయంత్రం 5 గంటల లోపు రాజు పీడీ 9441183035, రవి పీడీ 9490683248 నంబర్లలో సంప్రదించాలని ఆయన తెలిపారు.

జగిత్యాలరూరల్(సారంగాపూర్): రాష్ట్ర ప్రభుత్వం క్రీడా పాఠశాలల్లో 2025–26 విద్యా సంవత్సరానికి గాను 4వ తరగతి ప్రవేశానికి విద్యార్థినీ, విద్యార్థులను మండలస్థాయిలో ఈనెల 19న ఎంపిక చేయనున్నట్లు ఎంఈవో కిశోర్ తెలిపారు. క్రీడాకారులు ప్రభుత్వ ఉన్నత పాఠశాల సారంగాపూర్‌లో ఉదయం 10 గంటలకు హాజరు కావాలని కోరారు.

క్రీడా కోర్సుల్లో ప్రవేశాలు

జగిత్యాలటౌన్: భారత ప్రభుత్వ యువజన వ్యవహారాలు క్రీడల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని లక్ష్మీబాయి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫిజికల్ ఎడ్యుకేషన్ గ్వాలియార్ స్పోర్ట్స్ కోచింగ్ కోర్సుల్లో ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైందని జిల్లా యువజన, క్రీడల అధికారి కోరుకంటి రవికుమార్ మంగళవారం తెలిపారు. 1 డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్(డీఎస్‌సీ), 2 పోస్ట్ గ్రాడ్యుయేషన్ డిప్లొమా ఇన్ స్పోర్ట్స్ కోచింగ్(పీడీడీఎస్‌సీ), 3 పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ ఫిట్‌నెస్ మేనేజ్‌మెంట్(పీజీడీఎఫ్ఎం), 4 పోస్ట్ గ్రాడ్యుయేట్ డిప్లొమా ఇన్ స్ట్రెంత్ అండ్ స్పోర్ట్స్ కండీషనింగ్(పీజీడీఎస్ఎస్‌సీ) కోర్సులలో 2025–26 విద్యాసంవత్సరానికి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నారని జిల్లాకు చెందిన ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలు www.lnipe.edu.in వెబ్ సైట్‌లో పొందవచ్చునని ఆయన తెలిపారు.